


# కరపత్రం

SINCE 2014

సోమవారం సెప్టెంబర్ 21,2026 | సంపుటి : 2 | సంచిక : 343 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4



## ఇందిరమ్మ ఫ్లాట్ల లబ్ధిదారులకు నేటి నుంచి అలాట్‌మెంట్ లెటర్లు

- వాట్సప్, ఎస్సెమ్మెస్ ద్వారా నేరుగా పత్రాలు
- హౌసింగ్ బోర్డు వెబ్‌సైట్‌లోనూ డౌన్‌లోడ్ సౌకర్యం
- రాయదుర్గంలో 480 ఇందిరమ్మ ఫ్లాట్లు
- సోమవారం మంత్రి పొంగులేటి శంకుస్థాపన
- రూ.50 లక్షల విలువైన ఫ్లాట్.. లబ్ధిదారులకు రూ.6 లక్షలకే
- ఒక్కో ఫ్లాట్‌కు రూ.5 లక్షల సబ్సిడీ
- 2.85 ఎకరాల్లో రూ.750 కోట్లకుపైగా విలువైన ప్రాజెక్టు

హైదరాబాద్:
ఇందిరమ్మ ఎల్‌ఐజీ ఫ్లాట్ల లబ్ధిదారులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఎంపికైన లబ్ధిదారులకు సోమవారం నుంచి అలాట్‌మెంట్ లెటర్లు జారీ చేయనున్నట్లు తెలంగాణ హౌసింగ్ బోర్డు ప్రకటించింది. లబ్ధిదారుల రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లకు నేరుగా వాట్సప్, ఎస్సెమ్మెస్ ద్వారా ఈ పత్రాలను పంపనున్నారు. అలాగే తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ నుంచి కూడా వీటిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. మరోవైపు శేరిలింగంపల్లి నియోజకవర్గం రాయదుర్గంలో ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ నిర్మాణానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. మల్కం చెరువు వెనుక భాగంలో సుమారు రూ.750 కోట్లకు పైగా విలువైన 2.85 ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఇక్కడ మొత్తం 480 ఫ్లాట్లను నిర్మిస్తారు. నాలెడ్జ్ సిటీ లాంటి ప్రధాన ప్రాంతంలో, మార్కెట్లో దాదాపు రూ.50 లక్షల విలువ చేసే ఒక్కో ఫ్లాట్‌ను... కేవలం రూ.6 లక్షలకే ప్రభుత్వం అందిస్తోంది. భూమి ఖర్చును పూర్తిగా భరిస్తున్న సర్కార్.. ఒక్కో ఫ్లాట్‌కు రూ.5 లక్షల చొప్పున సబ్సిడీని ఇస్తోంది. కాగా, మధ్యాహ్నం 3.30 గంటలకు జరిగే శంకుస్థాపన కార్యక్రమానికి లబ్ధిదారులు కుటుంబ సమేతంగా హాజరు కావాలని హౌసింగ్ బోర్డు అధికారులు విజ్ఞప్తి చేశారు.




## కోదాడ మెగా జాబ్ మేళాకు భారీ స్పందన

- 350 కంపెనీలు.. 30 వేల మందికిపైగా నమోదు
- 5,725 మంది అభ్యర్థులు షార్ట్‌లిస్ట్
- గ్రామీణ యువతకు స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు
- ఐటీ, ఫార్మా, బ్యాంకింగ్, తయారీ రంగాల కంపెనీల పాల్గొనడం
- సూర్యాపేట సహా 5 జిల్లాల యువతకు అవకాశాలు
- ప్రత్యక్ష ఇంటర్వ్యూలతో అభ్యర్థుల ఎంపిక
- గ్రామీణ ఉపాధి కల్పనలో మైలురాయి: స్పీకర్ ప్రసాద్‌కుమార్

హైదరాబాద్:
విద్యావంతులైన గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను చేరువ చేయాలన్న లక్ష్యంతో నిర్వహించిన కోదాడ మెగా జాబ్ మేళా విజయవంతమైంది. రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చొరవతో సుమారు 350 కంపెనీలు ఒకే వేదికపైకి రాగా, 30 వేల మందికిపైగా ఉద్యోగార్థులు నమోదు చేసుకున్నారు. వివిధ దశల్లో నిర్వహించిన ఇంటర్వ్యూల అనంతరం 5,725 మంది అభ్యర్థులు తదుపరి నియామక ప్రక్రియకు షార్ట్‌లిస్ట్ అయ్యారు.మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతిరెడ్డి నేతృత్వంలో సెప్టెంబర్ 19న నిర్వహించిన ఈ భారీ నియామక కార్యక్రమం గ్రామీణ నిరుద్యోగ సమస్యను ప్రధానాంశంగా తీసుకుంది. భౌగోళిక దూరం, ఉద్యోగ సమాచార లోపం, ఆర్థిక పరిమితుల కారణంగా ప్రముఖ సంస్థలను చేరుకోలేకపోతున్న గ్రామీణ యువతకు స్థానికంగానే అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో ఈ మేళాను నిర్వహించారు. సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన యువత ఈ మేళాలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఆ అసైన్డ్ భూములను ఎందుకు పంచలేదు: ఎంపీ చామల

హైదరాబాద్:
నిజాం ఆస్తుల కంటే మాజీ సీఎం కేసీఆర్ కుటుంబ ఆస్తులు ఎక్కువని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఆ ఆస్తులన్నీ ఎలా వచ్చాయని ప్రశ్నించారు. మూడోరోజు క్షేత్రస్థాయి భూముల పరిశీలనలో భాగంగా నగరంలోని అజీజ్‌నగర్‌లో ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు పర్యటించారు. అనంతరం చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు.

2లో




## కోర్టు ధిక్కరణ కేసులో LB నగర్ మాజీ ఏసీపీకి నెల రోజుల జైలు శిక్ష

హైదరాబాద్:
మాజీ ఏసీపీ ఎ.కృష్ణయ్యకు తెలంగాణ హైకోర్టు బిగ్ షాకిచ్చింది. కోర్టు ధిక్కరణ కేసులో న్యాయస్థానం ఆయనకు నెల రోజుల కఠిన కారాగార శిక్ష, రూ.2 వేల జరిమానా విధించింది. ఈ మేరకు హైకోర్టు జస్టిస్ కే.సుజన శుక్రవారం (సెప్టెంబర్ 18) ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, జడ్జిమెంట్ పై అప్పీల్ చేసుకునేందుకు వీలుగా కోర్టు ఆయనకు నాలుగు వారాల సమయం ఇచ్చింది.



2లో

## TRS అధికారంలోకి వస్తే ఫ్రీ విద్య, వైద్యం: కవిత

- విద్య, వైద్యం కోసం రూ.లక్ష కోట్లు ఖర్చు
- పాలమూరులో 10 లక్షల ఎకరాలకు నీళ్లు: కవిత
- రైతులకు నీళ్లు, యూరియా, కరెంట్ అందడం లేదని ఆరోపణ
- ప్రజాసమస్యలు వదిలి నేతలు బూతులు తిట్టుకుంటున్నారు
- ఎల్‌నినో, భూగర్భ జలాల తగ్గుదలతో రైతుల ఇబ్బందులు
- కొడంగల్ కోస్గిలో 'పాంచజన్య శంఖరావం' సభ

హైదరాబాద్:
రాష్ట్రంలో తెలంగాణ రక్షణ సేన అధికారంలో వస్తే విద్య, వైద్యం ఉచితంగా అందిస్తామని పార్టీ చీఫ్ కవిత ప్రకటించారు. విద్య, వైద్యం కోసం లక్ష కోట్లు అయిన ఖర్చు చేస్తామని పేర్కొన్నారు. ఆదివారం (సెప్టెంబర్ 20) కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గిలో పాంచజన్య శంఖరావం పేరుతో టీఆర్ఎస్ పార్టీ భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసింది.

## మీ ఆస్తులు.. మా ఆస్తులపై విచారణకు సిద్ధమా?

- సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సవాల్
- మహిళలకు రూ.2,500 హామీ ఏమైంది?: హరీశ్‌రావు
- 2 లక్షల ఉద్యోగాలు ఇచ్చారా? అని ప్రశ్న
- ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆపేశారని విమర్శ
- కాంగ్రెస్ నేతల భూ కబ్జాలపై మాట్లాడితే దాడులా? అని ఆగ్రహం
- రాష్ట్ర నిధుల కోసం ఎంపీలు ఢిల్లీలో పోరాడాలని సూచన
- తెలంగాణలో పోలీసు వ్యవస్థ బతికే ఉందా?: ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్




మోటకొండూరు:
కాంగ్రెస్ పాలన వల్ల ఎవరికీ లాభం లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500 చొప్పున ఇస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఎవరికైనా ఇచ్చారా? 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు.. ఇచ్చారా?" అని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా ఆపేశారని విమర్శించారు. యాదాద్రి జిల్లా మోటకొండూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

## జైశంకర్‌కు ఈసీ SIR నోటీసులు



2లో

- భార్య క్యోకో జైశంకర్‌కూ నోటీసులు
- 'అన్‌మ్యాప్‌డ్ విత్ లాస్ట్ 'సర్' కింద చర్యలు
- 2002 'సర్' వివరాలతో మ్యాపింగ్ కాకపోవడంతో నోటీసులు
- న్యూఢిల్లీ సుందర్‌బాగ్‌లో జైశంకర్ దంపతులకు ఓటు
- సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ కుటుంబానికీ నోటీసులు
- మాజీ ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది దంపతులకూ నోటీసులు




## మంజీరా ఫేజ్--2లో భారీ లీకేజీ.. హైదరాబాద్ లోని ఈ ఏరియాల్లో ఉండే పబ్లిక్ నీళ్లు పొదుపుగా వాడుకోకపోతే కష్టమే !

హైదరాబాద్:
మంజీరా ఫేజ్--2లో భారీ లీకేజీ కారణంగా హైదరాబాద్ సిటీ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. బీరంగూడ కమాన్ వద్ద 1500 ఎంఎం వ్యాసం గల పైప్‌లైన్ లీకేజీ అయింది. పటాన్‌చెరు--హైదర్‌నగర్ పంపింగ్ మెయిన్ పైప్‌లైన్‌లో భారీ లీకేజీ కావడంతో లీకేజీ నివారణకు జలమండలి అత్యవసర మరమ్మతు పనులు చేసింది.

## హైదరాబాద్‌లో ఈగల్ ఫోర్స్ భారీ ఆపరేషన్

హైదరాబాద్:
డ్రగ్స్ నెట్‌వర్క్‌పై ఈగల్ ఫోర్స్ భారీ ఆపరేషన్ చేపట్టింది. అంతర్జాతీయ డ్రగ్స్ రవాణా ముఠా గుట్టు రట్టయ్యింది. డెడ్ డ్రాప్ పద్ధతిలో డ్రగ్స్ సప్లై చేస్తూ.. వాట్సాప్, గూగుల్ మ్యాప్స్ ద్వారా విక్రయాలు జరుపుతున్నారు. 36 గంటల పాటు ఈ ఆపరేషన్ చేపట్టిన ఈగల్ ఫోర్స్.. 31 మంది క్యారియర్లు, 230 మంది వినియోగదారులను గుర్తించింది. ఒడిశాకు చెందిన పలువురు కీలక ముఠా సభ్యులను ఈగల్ ఫోర్స్ అరెస్ట్ చేసింది. 23 మంది బాధితులకు డి-అడిక్షన్ పూర్తి కాగా.. వారిని కోర్టు ముందు హాజరుపర్చగా.. ఎన్డీపీఎస్ యాక్ట్ సెక్షన్ 64-A కింద పునరావాసం పొందిన వారికి న్యాయస్థానం మినహాయింపు ఇచ్చింది. మైనర్లకు పొగాకు ఉత్పత్తులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని.. పాన్ షాపుల యాజమాన్యాలకు ఈగల్ ఫోర్స్ హెచ్చరికలు జారీ చేసింది.

EAGLE FORCE
ELITE ACTION GROUP FOR DRUG LAW ENFORCEMENT




## వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో పైకప్పు పెచ్చులూడి పలువురికి గాయాలు

# కోర్టు ధిక్కరణ కేసులో LB నగర్ మాజీ ఏసీపీకి నెల రోజుల జైలు శిక్ష

మొదటిపేజీ తరువాయి

అప్పటి వరకు తీర్పును సస్పెండ్ చేసింది. ప్రపంచపటాలు పరిశీలించండి వ్యాపారవేత్త కట్టా వంశీ కృష్ణపై సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో వరకట్న హత్య కేసు నమోదైంది. ఈ కేసులో నిందితుడిని అరెస్ట్ చేయకుండా రక్షణ కల్పిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ అప్పటి ఎల్ బీ నగర్ ఏసీపీ కృష్ణయ్య నిందితుడిని అరెస్ట్ చేశారు. కోర్టు ఆర్డర్స్ ఉన్నప్పటికీ తనను అరెస్ట్ చేయడాన్ని సవాల్ చేస్తూ వంశీ కృష్ణ హైకోర్టును ఆశ్రయించాడు. పోలీసులు తనను నిరంతరం వేధిస్తున్నారని, హైకోర్టు ఉత్తర్వుల గురించి చెప్పినప్పటికీ పోలీసులు పట్టించుకోలేదని, కేసు రికార్డులలో తనను పరారీలో ఉన్నట్లు తప్పుగా చూపించారని నిందితుడు పిటిషన్?లో పేర్కొన్నాడు. ఈ పిటిషన్ పై విచారణ చేపట్టిన హైకోర్టు జస్టిస్ కే.సుజన
ఏసీపీపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఏసీపీ కోర్టు ఆదేశాలను బేఖాతరు చేసినట్లు నిర్ధారిస్తూ అతడికి నెలరోజుల పాటు కఠిన జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధించారు. నిందితుడిని అరెస్ట్ చేయకుండా మధ్యంతర ఉత్తర్వును పొడిగించిన విషయం ఏసీపీ కృష్ణయ్యకు తెలియదని, నేరం తీవ్రత దృష్ట్యానే ఆయన అలా వ్యవహరించారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించారు.
ఏసీపీ కోర్టుకు బేషరతుగా క్షమాపణ కూడా చెప్పారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే, ఉత్తర్వును పొడిగించారో లేదో తనిఖీ చేయడం అధికారి బాధ్యత అని పేర్కొన్న న్యాయస్థానం.. ఏసీపీ వివరణ, క్షమాపణను తిరస్కరించింది. పీపీ అభ్యర్థన మేరకు ఏసీపీ అప్పీల్ దాఖలు చేసుకునేందుకు వీలుగా న్యాయమూర్తి ఆ ఉత్తర్వు అమలును నాలుగు వారాల పాటు నిలిపివేశారు.

# విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌కు ‘సర్’ నోటీసులు

మొదటిపేజీ తరువాయి

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా పలువురు ప్రముఖులకు ఎన్నికల సంఘం నోటీసులిస్తోంది. ఇప్పటికే దిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, ఆయన కుటుంబ సభ్యులకు నోటీసులివ్వడంపై ప్రతిపక్షాల నుంచి తీవ్ర దుమారం రేగిన సంగతి తెలిసిందే. తాజాగా విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌తోపాటు ఆయన భార్య క్యోకో జైశంకర్‌కు ఈసీ నోటీసులు జారీ చేసింది. ‘అన్‌మ్యాప్‌డ్ విత్ లాస్ట్ ఎస్ఐఆర్’ కింద ఈ నోటీసులు జారీ అయ్యాయి. వారి ప్రస్తుత వివరాలను ఎస్ఐఆర్–2002 వివరాలతో మ్యాపింగ్ చేయకపోవడంతోనే నోటీసులు జారీ చేసినట్లు ఈసీ వెల్లడించింది. జైశంకర్, ఆయన భార్యకు న్యూదిల్లీ అసెంబ్లీ పరిధిలోని సుందర్‌బాగ్‌లో ఓటు హక్కు ఉంది.
మరోవైపు సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ భార్య షెబా బ్రిట్టాస్, కుమారుడు ఆనంద్‌కు కూడా ‘సర్’ నోటీసులు అందాయి. గత రికార్డులతో షెబా పేరు సరిపోలకపోవడంతో ఆమెకు, ఆనంద్‌కు నోటీసులు జారీ అయ్యాయి. ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, ఆయన భార్య సునీతా ద్వివేదికి కూడా ‘అన్‌మ్యాప్‌డ్ విత్ లాస్ట్ ఎస్ఐఆర్’ కింద నోటీసులిచ్చినట్లు తెలుస్తోంది.

# TRS అధికారంలోకి వస్తే ఫ్రీ విద్య, వైద్యం: కవిత

మొదటిపేజీ తరువాయి

పార్టీ చీఫ్ కవిత ఈ సభకు హాజరై ప్రసగించారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్షాలు ప్రజాసమస్యలను గాలికి వదిలేసి ఒకరిని ఒకరు బూతులు తిట్టుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయం అంటే బూతులు తిట్టుకోవడమేనా అని ప్రశ్నించారు. ఓవైపు ఎల్ నినో పరిస్థితులు మరోవైపు భూగర్భ జలాలు ఎండిపోవడంతో సాగు నీరు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.
నీళ్లు, ఎరువులు, కరెంట్ లేక రైతులు అరిగోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి రైతులకు నీళ్లు ఇచ్చే ఆలోచన లేదని ఆరోపించారు. నీళ్లు, యూరియా, పండించిన ధాన్యం కొనుగోలు కోసం రైతులు అధికారుల కాళ్లు పట్టుకోవాల్నా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ అధికారంలోకి వస్తే పాలమూరులో 10 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు.

# మంజీరా ఫేజ్--2లో భారీ లీకేజీ.. హైదరాబాద్ లోని ఈ ఏరియాల్లో ఉండే పబ్లిక్ నీళ్లు పొదుపుగా వాడుకోకపోతే కష్టమే !

మొదటిపేజీ తరువాయి

ఈ మరమ్మతు పనులను జలమండలి ఎండీ అశోక్ రెడ్డి పరిశీలించారు. యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు పూర్తి చేయాలని అధికారులకు ఎండీ ఆదేశించారు. ఓ అండ్ ఎం, ట్రాన్స్‌మిషన్ అధికారుల సమన్వయంతో పనులు చేస్తున్నారు. మరమ్మతులు పూర్తయ్యాక దశలవారీగా తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తామని అధికారులు చెప్పారు.

RC పురం, అశోక్‌నగర్, జ్యోతినగర్, లింగంపల్లిలో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. చందానగర్, గంగారం, మదీనాగూడ, మియాపూర్ ప్రాంతాల్లోనూ నీటి ఇబ్బందులు తప్పలేదు. బీరంగూడ, అమీన్‌పూర్, భాగ్యనగర్ కాలనీ, ఎర్రగడ్డలోనూ అంతరాయం ఉంది.
ఎస్.ఆర్.నగర్, అమీర్‌పేట్ ప్రాంతాలకు తాగునీటి సరఫరాపై ఈ పైప్ లైన్ లీకేజ్ ప్రభావం పడింది. కేపీహెచ్‌బీ కాలనీ, కూకట్‌పల్లి, ప్రగతినగర్‌కు కూడా తాగు నీటి సరఫరాలో అంతరాయం కలిగింది. ప్రభావిత ప్రాంతాల ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలని జలమండలి విజ్ఞప్తి చేసింది.

# మీ ఆస్తులు.. మా ఆస్తులపై విచారణకు సిద్ధమా?

మొదటిపేజీ తరువాయి

రేవంత్‌రెడ్డికి, వారి కుటుంబ సభ్యులు, సన్నిహితులకు ఉద్యోగాలు వచ్చాయి తప్ప.. సాధారణ యువతకు లబ్ధి చేకూరలేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒక్క కాల్వ కూడా తవ్వలేదని ఆక్షేపించారు. “ కాంగ్రెస్ నేతలు చేస్తున్న భూ కబ్జాపై మాట్లాడినందుకే మాపై దాడి చేశారు. మీ ఆస్తులు, మా ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమా? ఇక్కడ యాత్రలు చేయడం కాదు.. రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం ఎంపీలు దిల్లీలో కొట్లాడాలి. మీ యాత్రలు రేవంత్‌రెడ్డి ఇంటికి చేయండి” అని హరీశ్‌రావు అన్నారు.

**తెలంగాణలో పోలీసు వ్యవస్థ బతికే ఉందా?: ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్**

కాంగ్రెస్ నేతలు ప్రైవేటు ఆస్తులపై దాడులు చేస్తున్నారని బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ విమర్శించారు. తెలంగాణలో పోలీసు వ్యవస్థ బతికే ఉందా?అని ప్రశ్నించారు. ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు భూముల పరిశీలనకు వెళ్లడంపై ఆయన మండిపడ్డారు. దాడులు చేస్తామన్నవారిని బందోబస్తుతో పంపిస్తున్నారని, తాము నిరసన చేస్తామంటే ఇంటి నుంచి బయటకు వెళ్లనివ్వడం లేదని ఆక్షేపించారు. ఫాంహౌస్‌ల చుట్టూ తిరుగుతున్న వారిని పోలీసులు ఎందుకు అడ్డుకోవట్లేదని ప్రశ్నించారు.

# కోదాడ మెగా జాబ్ మేళాకు భారీ స్పందన

మొదటిపేజీ తరువాయి

సమాచార సాంకేతికత, ఫార్మా, తయారీ, వైద్య ఆరోగ్య రంగం, బ్యాంకింగ్, రిటైల్‌తోపాటు వివిధ రంగాలకు చెందిన సంస్థలు అభ్యర్థుల విద్యార్హతలు, నైపుణ్యాలను పరిశీలించి ప్రత్యక్ష ఇంటర్వ్యూలు నిర్వహించాయి. గ్రామీణ కుటుంబాలు ఎన్నో త్యాగాలు చేసి తమ పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నప్పటికీ, వారికి సరైన సమయంలో ఉద్యోగ సమాచారం అందడం లేదని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

ఇంజినీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్, పాలిటెక్నిక్ తదితర కోర్సులు పూర్తి చేసిన యువత ఉద్యోగ అవకాశాలను గుర్తించడం, సంస్థలను సంప్రదించడం, ఇంటర్వ్యూల కోసం పదేపదే నగరాలకు వెళ్లడం వంటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వివరించారు. ఒక యువకుడి గ్రామ చిరునామా లేదా కుటుంబ ఆర్థిక పరిస్థితి అతని ఉద్యోగ అవకాశాలకు అడ్డంకిగా మారకూడదన్నదే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు.

అర్హులైన ఉద్యోగుల కోసం ఎదురుచూస్తున్న కంపెనీలు, తొలి అవకాశం కోసం నిరీక్షిస్తున్న గ్రామీణ యువతను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా వారి మధ్య ఉన్న అంతరాన్ని ఈ మేళా తగ్గించిందన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హతలు, నైపుణ్యాలను నేరుగా సంస్థల ప్రతినిధుల ముందు ప్రదర్శించడంతోపాటు సంఘటిత రంగంలో ఉద్యోగాలు పొందేందుకు అవసరమైన అర్హతలు, నైపుణ్యాలపై అవగాహన పొందారని తెలిపారు.

గత ఏడాది హుజూర్‌నగర్‌లో నిర్వహించిన జాబ్ మేళా అనుభవానికి కొనసాగింపుగా కోదాడలో ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృత స్థాయిలో చేపట్టారు. పారిశ్రామికవేత్తలు, విద్యాసంస్థలు, ఐదు జిల్లాల అధికార యంత్రాంగంతో ముందస్తుగా సమన్వయం చేసుకుని యువతను పెద్ద ఎత్తున సమీకరించారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఈ కార్యక్రమానికి సహకారం అందించాయి.

జాబ్ మేళాలో పాల్గొన్న యువతను ఉద్దేశించి శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ, గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలను చేరువ చేయడంలో కోదాడ మెగా జాబ్ మేళా రాష్ట్రంలో ఒక మైలురాయిగా నిలుస్తుందని ప్రశంసించారు. ఒకే వేదికపైకి సుమారు 350 కంపెనీలను తీసుకురావడం అసాధారణమైన ప్రయత్నమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటువంటి భారీ ఉద్యోగ మేళాలను నిర్వహించి యువత నివసిస్తున్న ప్రాంతాలకు చేరువలోనే ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఐటీ--పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రోడ్లు--భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తదితరులు జాబ్ మేళాలో పాల్గొన్నారు. కంపెనీల ప్రతినిధులు, ఉద్యోగార్థులతో వారు మాట్లాడి, ఉద్యోగ అవకాశాలు పొందిన అభ్యర్థులను అభినందించారు.

# బిహార్ టు పంజాబ్.. తప్పిపోయిన వృద్ధుడిని ఇంటికి చేర్చి!

మానసిక స్థితి సరిగా లేని ఓ వృద్ధుడు తప్పిపోగా.. ఆయన్ను బిహార్ నుంచి పంజాబ్‌లోని స్వస్థలానికి చేర్చి మానవత్వాన్ని చాటుకున్నాడో యువకుడు. పంజాబ్ లుధియానాలోని ఫతేగఢ్ గుజ్రన్ గ్రామానికి చెందిన చమన్‌లాల్ అనే వృద్ధుడు ఈ నెల 11న అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయ సందర్శనకు వెళ్లి తప్పిపోయారు. ఈ క్రమంలోనే బిహార్ వెళ్లే రైలు ఎక్కి.. గయలో దిగారు. అక్కడే తచ్చాడుతుండగా.. అక్కడే ఉన్న నీరజ్ ఆయన పరిస్థితిని గమనించారు. ఎలాగైనా అతడని ఇంటికి చేర్చాలని నిర్ణయించుకున్నారు. నాలుగు రోజుల పాటు తన ఇంట్లోనే



ఆశ్రయమిచ్చారు.తప్పిపోయిన వృద్ధుడు ఊరి పేరు మాత్రమే చెప్పడంతో..



ఇంటర్నెట్ సాయంతో ఆ గ్రామాన్ని గుర్తించి పంజాబ్‌కు బయల్దేరారు.

మరోవైపు, లాల్ కుటుంబీకులు ఆయన కోసం వెతుకుతూనే ఉన్నారు. ఈ క్రమంలోనే పంజాబ్ చేరుకున్న నీరజ్.. అక్కడి స్థానికుడిని ఫతేగఢ్ గుజ్రన్ వివరాలు ఆరా తీశారు. అప్పటికే లాల్ గురించి సోషల్ మీడియాలో పోస్ట్ చూసిన ఆ వ్యక్తి.. ఆయన్ను గుర్తుపట్టారు. వృద్ధుడి కుటుంబ సభ్యులకు ఫోన్ చేయగా.. వారు వెంటనే అక్కడికి చేరుకున్నారు. లాల్ క్షేమంగా ఇంటికి చేరుకోవడంతో వారు ఎంతో సంతోషించారు. మానవత్వం ఇంకా బతికే ఉందని నిరూపించారని వృద్ధుడి మనవడు సుఖ్‌చైన్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు

# ఆ కట్టడాన్ని.. సైనిక కాంప్లెక్స్‌గానూ తీర్చిదిద్దుతాం: ట్రంప్

దేశ రాజధాని వాషింగ్టన్ డీసీలో ఓ భారీ విజయ తోరణాన్ని నిర్మించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రణాళికలు రచిస్తున్న విషయం తెలిసిందే. ఈ కట్టడం విషయంలో తాజాగా ఆయన కీలక ప్రకటన చేశారు. డ్రోన్లు, స్నైపర్‌లను మోహరించడంతోపాటు మందుగుండు సామగ్రిని సైతం నిల్వ చేసే సైనిక కాంప్లెక్స్‌గానూ ఈ కట్టడాన్ని తీర్చిదిద్దుతామని తెలిపారు.“ప్రపంచంలోని 59 అగ్ర నగరాలు, రాజధానుల్లో.. ఒక్క వాషింగ్టన్ డీసీలోనే విజయ తోరణం లేదు. కానీ, ఇప్పుడు అన్నింటికన్నా గొప్ప కట్టడాన్ని నిర్మిస్తాం. సైన్యం అభ్యర్థన మేరకు, దేశ భద్రత ప్రయోజనాల దృష్ట్యా.. ప్రతిపాదిత 250 అడుగుల



ఎత్తయిన ఈ నిర్మాణాన్ని అత్యున్నత శ్రేణి సైనిక సముదాయంగానూ మార్చేందుకు అంగీకరించాను. పెద్దసంఖ్యలో డ్రోన్లు, స్నైపర్‌లను మోహరించేందుకు, అదేవిధంగా మందుగుండు సామగ్రిని నిల్వ ఉంచేందుకు వీలుగా దీన్ని తీర్చిదిద్దుతాం” అని ట్రంప్ ‘ట్రూత్ సోషల్’ వేదికగా పోస్టు పెట్టారు. ఆర్లింగ్టన్ మెమోరియల్ బ్రిడ్జికి ఆనుకుని ఉన్న రిసెప్టివ్ సర్కిల్ వద్ద ఈ తోరణాన్ని నిర్మించేందుకు ప్రతిపాదించారు. వాషింగ్టన్ డీసీపై తన శాశ్వత ముద్ర వేసేందుకు ట్రంప్ చేపడుతున్న అనేక ప్రాజెక్టుల్లో ఇదీ ఒకటి. వైట్ హౌస్ బాల్‌రూమ్, లింకన్ మెమోరియల్ రిఫ్లెక్టింగ్ పూల్ పునరుద్ధరణ, ఈస్ట్ పొటోమాక్ పార్క్‌లో గోల్ఫ్ కోర్సు పునర్నిర్మాణం వంటివి ఇందులో ఉన్నాయి.

# ఆ అసైన్డ్ భూములను ఎందుకు పంచలేదు: ఎంపీ చామల

మొదటిపేజీ తరువాయి

“ప్రజలకు వాస్తవాలు తెలియాలనే ఉద్దేశంతోనే ఈ భూముల పరిశీలనకు వచ్చాం. కేటీఆర్‌కు 2009లో లేని ఆస్తులు ఇప్పుడెలా వచ్చాయి హరీశ్‌రావుకు ఉద్యమ సమయంలో లేని ఫామ్‌హౌస్ ఇప్పుడు ఎలా వచ్చింది కేసీఆర్ ఫామ్‌హౌస్ పక్కన ఉన్న 300 ఎకరాల అసైన్డ్ భూములను దళితులకు ఎందుకు పంచలేదు ఆ భూమిని కబ్జా చేయాలని కేసీఆర్ చూశారు” అని చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు.

# వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో పైకప్పు పెచ్చులూడి పలువురికి గాయాలు

మొదటిపేజీ తరువాయి

వరంగల్ నగరంలోని ఎంజీఎం ఆసుపత్రిలో పైకప్పు పెచ్చులూడి పలువురికి గాయాలయ్యాయి. ఆరోగ్య శ్రీ వార్డులో ఆదివారం ఉన్నట్టుండి పైకప్పు పెచ్చులూడి ఒక్కసారిగా కిందపడ్డాయి. ఆ సమయంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సారయ్య, మస్తాన్, స్వరూపలతో పాటు వారిని పరామర్శించేందుకు వచ్చిన వారికి, ఇద్దరు పారిశుద్ధ్య కార్మికులకు గాయాలయ్యాయి. ఆసుపత్రి సిబ్బంది వెంటనే వారిని అత్యవసర విభాగానికి తరలించారు. గతంలోనూ ఆసుపత్రిలో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. క్షతగాత్రులను ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రామ్ కుమార్ రెడ్డి పరామర్శించారు.

# 93 ఏళ్ల వృద్ధురాలి డ్రైవింగ్.. కారు బీభత్సంలో ఒకరు మృతి

అమెరికాలోని న్యూజెర్సీలో కారు బీభత్సం సృష్టించింది. రద్దీగా ఉండే ఓ రెస్టరంట్ వద్ద జన సమూహంపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా మరో ఏడుగురు గాయపడ్డారు. లావాలెట్‌లోని మెక్స్ గ్రిల్ హోటల్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది.రెస్టరంట్ వద్దకు కారులో వచ్చిన ఓ 93 ఏళ్ల వృద్ధురాలు.. ఎదురుగా పార్క్ చేసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో బ్రేకులకు బదులు పొరపాటున యాక్సిలరేటర్ తొక్కినట్లు తెలుస్తోంది. దీంతో రెస్టరంట్ బయట కూర్చున్న కస్టమర్లపైకి వాహనం దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 53 ఏళ్ల మహిళ చనిపోయినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. డ్రైవింగ్ చేస్తున్న వృద్ధురాలికి కూడా స్వల్ప గాయాలైనట్లు సమాచారం.

# వెయ్యి డ్రోన్లతో..

## రష్యాపై విరుచుకుపడ్డ ఉక్రెయిన్..!





రష్యా–ఉక్రెయిన్ మధ్య దాడులు కొనసాగుతున్నాయి. శనివారం రాత్రి ఉక్రెయిన్ దళాలు రష్యాపై ఏకంగా వెయ్యికిపైగా డ్రోన్లతో విరుచుకుపడ్డాయి. మాస్కోలోని పలు ప్రదేశాలే లక్ష్యంగా దాడులు చేపట్టినట్లు ఉక్రెయిన్ సైన్యం వెల్లడించింది. మాస్కో ఆయిల్ రిఫైనరీకి సమీపంలోనూ ఈ దాడులు జరగడంతో అక్కడ పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. భారీగా పొగ వ్యాపించింది. యుద్ధం మొదలైనప్పటి నుంచి దేశ రాజధానిపై ఈ స్థాయిలో గగనతల దాడులు చేపట్టడం ఇదే మొదటిసారని మాస్కో మేయర్ పేర్కొన్నారు. మరో 450 ఉక్రెయిన్ డ్రోన్లను తమ దళాలు కూల్చివేశాయన్నారు.
పలు డ్రోన్లు మాస్కోలోని కీలక ఆయిల్ రిఫైనరీలు సహా నాలుగు భవనాలను తాకినట్లు అధికారులు పేర్కొన్నారు. మరోవైపు క్రిమియాపైనా ఉక్రెయిన్ పెద్ద ఎత్తున దాడులు కొనసాగిస్తోంది. సైనిక సరఫరాలను, విద్యుత్తు వ్యవస్థల్ని స్తంభింపజేసేలా తాజా దాడులు జరిపింది. వీటి కారణంగా మాస్కోలోని ప్రధాన విమానాశ్రయాలు తాత్కాలికంగా మూతపడ్డాయి. దీంతో పలు విమానాలు రద్దుకాగా.. మరికొన్ని ఆలస్యంగా నడిచాయి. త్వరలో రష్యా పార్లమెంటరీ ఎన్నికలు నిర్వహిస్తున్న నేపథ్యంలో మాస్కోపై ఉక్రెయిన్ దాడులు తీవ్రం చేయడం గమనార్హం.
ఈ దాడులపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మాట్లాడుతూ.. కీలక వ్యాఖ్యలు చేశారు. ‘గత రాత్రి మాస్కోలోని అనేక ప్రాంతాలను మా దళాలు లక్ష్యం చేసుకున్నాయి. రష్యాకు చెందిన ఓ కీలక చమురు కర్మాగారం ధ్వంసమైంది. ఇందుకుగానూ మా భద్రతా దళాలు, గూఢచార విభాగం, ప్రత్యేక దళాలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. ఇకనైనా మాస్కో యుద్ధాన్ని ముగించి.. శాంతిని ఎంచుకోవాలని కోరుకుంటున్నా’ అని జెలెన్‌స్కీ పేర్కొన్నారు.

## న్యాయః మమ ధర్మః అనే స్ఫూర్తితో పనిచేసే

# న్యాయవాద పరిషత్ కోరుట్ల శాఖ కార్యవర్గ ఎన్నిక

**గాజంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**

భారతీయ సాంస్కృతిక, తాత్విక మరియు సాంప్రదాయ విలువల ఆధారంగా భారత న్యాయ వ్యవస్థను సంస్కరించే లక్ష్యంతో 7 సెప్టెంబరు 1992 న న్యూఢిల్లీలో ప్రముఖ సామాజిక సంస్కర్త దత్తోపంత్ ఠేంగ్డే చేతుల మీదుగా ప్రారంభించబడిన న్యాయవాద పరిషత్ కోరుట్ల శాఖ 19 సెప్టెంబర్ 2026 రోజున ప్రారంభించబడింది.

**"న్యాయః మమ ధర్మః" న్యాయమే నా ధర్మం అనే నినాదంతో పనిచేసే న్యాయవాద పరిషత్ ను అఖిల భారతీయ అధివక్త పరిషత్ అని కూడా పిలుస్తారు.**

- సమాజంలోని వెనుకబడిన, బలహీన వర్గాల ప్రజలకు ఉచిత న్యాయ సహాయాన్ని అందించడం,యువ న్యాయవాదులకు మార్గదర్శకత్వం, వృత్తిపరమైన శిక్షణ అందించడానికి జాతీయ మరియు ప్రాంతీయ స్థాయిలలో వర్క్‌షాప్‌లు, సదస్సులు నిర్వహించడం,న్యాయవ్యవస్థలో జవాబుదారీతనం (Judicial Accountability)





మరియు పారదర్శకత కోసం చట్టపరమైన చర్చలు చేపట్టడం న్యాయవాద పరిషత్ లక్ష్యాలు.

తేది: 19-09-2019, శనివారము రోజున ఎన్నికైన కోరుట్ల కోర్టు కార్యకారిణి లో
- గౌరవ అధ్యక్షులుగా న్యాయవాది బోయిని సత్యనారాయణ.
- అధ్యక్షులుగా న్యాయవాది భీమనాతి రఘు.
- ఉపాధ్యక్షులుగా న్యాయవాదులు ఇంద్లి రవికుమార్, గల్న ప్రదీప్.



- ప్రధాన కార్యదర్శిగా న్యాయవాది చిట్యాల శివకుమార్
- సహాయ కార్యదర్శులుగా న్యాయవాదులు బూర్గు గణేష్ & వంగల శ్రీనివాస్
- కోశాధికారిగా న్యాయవాది చింతకింది కిరణ్ సాయి.
- మహిళా విభాగం సభ్యులుగా న్యాయవాదులు మోర్తాడ్ ఉమ, అల్లే పద్మకళ,గంప భాగ్యలక్ష్మి.
- కార్యకారిణి సభ్యులుగా న్యాయవాదులు బద్ది సృజన్ కుమార్,కటకం మణికంఠ,ఆమిటి రమేష్ కుమార్,భూశెట్టి రాజేందర్,కుందారపు వివేక్,జక్కుల ప్రవీణ్,నూతిగౌడు తిరుపతి,పొల్తర్ వంశీ,చిట్యాల నిఖిల్,విగ్యారపు అనిల్ ఎన్నికయ్యారు.

నూతన కార్యవర్గ ఎన్నిక సందర్భంగా న్యాయవాద పరిషత్ గౌరవాధ్యక్షులు బోయిని సత్యనారాయణ మాట్లాడుతూ..లాయర్ల కోసం పనిచేసే స్వచ్ఛంద జాతీయ సంస్థల వర్గీకరణలో న్యాయవాద పరిషత్ దేశంలోనే అతి పెద్దదిగా గుర్తింపు పొందిందని అన్నారు.

- న్యాయవాద పరిషత్ అనేది కేవలం ఒక నిర్దిష్ట కోర్టు లేదా రాష్ట్రానికి పరిమితం కాలేదు. భారతదేశంలోని అన్ని రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాలలో దీనికి అనుబంధ విభాగాలు (State Units) మరియు వేలాది మంది సభ్యులు ఉన్నారు. స్వచ్ఛంద న్యాయవాద సంస్థలలో జాతీయ స్థాయిలో ఇంతటి విస్తృతమైన నెట్‌వర్క్ కలిగిన న్యాయవాద పరిషత్ కోరుట్ల యూనిట్ ను ప్రారంభించడం సంతోషకరంగా ఉందని నూతన అధ్యక్షుడు న్యాయవాది భీమనాతి రఘు అన్నారు.

న్యాయవాద పరిషత్ (ABAP) అనేది లాయర్ల సంక్షేమం, న్యాయ సంస్కరణలు మరియు సామాజిక సేవా లక్ష్యాలతో రిజిస్టర్ చేయబడిన ఒక స్వచ్ఛంద జాతీయ సంఘం అని నూతన ప్రధాన కార్యదర్శి న్యాయవాది చిట్యాల శివకుమార్ అన్నారు.

భారతదేశపు అత్యున్నత న్యాయ నిపుణులు, సుప్రీంకోర్టు మరియు హైకోర్టుల విశ్రాంత న్యాయమూర్తులు న్యాయవాద పరిషత్ లో భాగస్వామ్యం కలిగి ఉన్నారని....జస్టిస్ రమా జోయిస్, జస్టిస్ ఎన్. సంతోష్ హెగ్డే, జస్టిస్ ఆదర్శ్ కుమార్ గోయల్ వంటి ప్రముఖులు న్యాయవాద పరిషత్ తో అనుబంధం కలిగి ఉన్నారని తాము కూడా వృత్తి పరమైన అభివృద్ధిని సాధిస్తూ జాతీయ వాద న్యాయ వ్యవస్థ నిర్మాణంలో కృషి చేస్తామని సమావేశం తీర్మానించింది.

## వరంగల్ జిల్లా సర్పంచుల సంఘం జేఏసీ అధ్యక్షుడిగా దండెం సంపత్

- నిధుల విడుదలకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం: సుర్వి యాదయ్య గౌడ్









**కరపత్రం ప్రతినిది వరంగల్, సెప్టెంబర్ 20**
గ్రామ పంచాయతీలకు స్టేట్ ఫైనాన్స్ కమిషన్ (ఎస్ ఎఫ్ సి) నిధులను ప్రతి నెల క్రమం తప్పకుండా విడుదల చేయాలని తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ ప్రభుత్వాన్ని కోరింది. గ్రామాల అభివృద్ధి, పంచాయతీల నిర్వహణకు నిధుల కొరత సమస్యగా మారకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జేఏసీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ కోరారు. తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ మంత్రి, తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ గౌరవ అధ్యక్షుడు వి. శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా సర్పంచుల సంఘం జేఏసీ అధ్యక్షుడిగా దండెం సంపత్‌ను నియమించారు. ఈ మేరకు జేఏసీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. మాజీ సర్పంచుల సంఘం కార్యదర్శి మెడెం సాగర్ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సుర్వి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులు సకాలంలో అందితేనే గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతాయని అన్నారు. ఎస్ఎఫ్‌సీ నిధులను ప్రతి నెల విడుదల చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని పేర్కొన్న ఆయన, ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యల పరిష్కారానికి పనిచేస్తున్న సర్పంచులకు అందుతున్న గౌరవ వేతనాన్ని పెంచాలని కోరారు. పెరిగిన ఖర్చులు, సర్పంచులపై ఉన్న బాధ్యతలను పరిగణనలోకి తీసుకుని గౌరవ వేతనాన్ని ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సవరించాలని అన్నారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన దండెం సంపత్ మాట్లాడుతూ.. వరంగల్ జిల్లాలో సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. సర్పంచుల హక్కుల పరిరక్షణతో పాటు గ్రామ పంచాయతీల అభివృద్ధికి అవసరమైన అంశాలపై జేఏసీ తరపున నిరంతరం పనిచేస్తానన్నారు.వి. శ్రీనివాస్ గౌడ్ మార్గదర్శకత్వంలో, సుర్వి యాదయ్య గౌడ్ నాయకత్వంలో జిల్లాలోని సర్పంచులను సమన్వయం చేసుకుని సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేస్తామని దండెం సంపత్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం జేఏసీ నాయకులు, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## సీపీ శ్వేతను కలిసిన దివ్యాంగుల ఫోరం ప్రతినిధులు

- దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి వినతి





**కరపత్రం ప్రతినిది హనుమకొండ,సెప్టెంబర్ 20**
నవ తెలంగాణ రాష్ట్ర వికలాంగుల ఫోరం ప్రతినిధులు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేతను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు.రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ అజీమ్ ఆధ్వర్యంలో పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో సీపీని కలిసి దివ్యాంగుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో దివ్యాంగులపై దాడులు,దౌర్జన్యాలు, అవమానాలు,భూ ఆక్రమణలు, కబ్జాలు, అక్రమ కేసులు వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ప్రతినిధులు సీపీ దృష్టికి తీసుకెళ్లారు.ఇలాంటి ఘటనల్లో దివ్యాంగుల హక్కుల చట్టం--2016 ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి,వాటిలో జిల్లా దివ్యాంగుల కమిటీ సభ్యులను భాగస్వామ్యం చేయాలని విజ్ఞప్తి చేశారు.ప్రతి పోలీస్ స్టేషన్‌లో దివ్యాంగుల హక్కుల చట్టం--2016పై అవగాహన కల్పించే వాల్ పోస్టర్లు,బోర్డులు ఏర్పాటు చేయాలని,వీల్‌చైర్లు సులభంగా లోపలికి వెళ్లేలా ర్యాంపులు నిర్మించాలని కోరారు.ప్రతి మూడు నెలలకు ఒకసారి పోలీస్ కమిషనరేట్‌లో దివ్యాంగుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.సమస్యలపై సీపీ శ్వేత సానుకూలంగా స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ప్రతినిధులు తెలిపారు. అనంతరం దివ్యాంగుల హక్కుల చట్టం--2016పై అవగాహన కల్పించే పోస్టర్‌ను సీపీ శ్వేత ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ అజీమ్,ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బండి చక్రపాణి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గై సతీష్,రాష్ట్ర సలహాదారు చదలవాడ లక్ష్మీనారాయణ,హనుమకొండ జిల్లా కార్యదర్శులు అఫ్జల్,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులను ఆదుకోవాలి సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక చైర్మన్ గుడిమల్ల రవికుమార్
- ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.10 వేల కోట్ల నిధులు కేటాయించాలి





**కరపత్రం ప్రతినిది వరంగల్,సెప్టెంబర్ 20**
తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన తొలి,మలిదశ ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక చైర్మన్ గుడిమల్ల రవికుమార్ డిమాండ్ చేశారు. ఉద్యమకారుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.10 వేల కోట్ల నిధులు కేటాయించాలని కోరారు.తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపట్టిన ఓదార్పు యాత్రలో భాగంగా మూడో రోజు శ్రీనివాస్ కాలనీ, దేశాయిపేట, ఎల్బీనగర్, లోతుకుంట, చార్‌బౌలి తదితర ప్రాంతాల్లో రవికుమార్ పర్యటించి ఉద్యమకారులను, వారి కుటుంబాలను పరామర్శించారు. నాలుగో రోజు సందర్భంగా కృష్ణ కాలనీ లేబర్ కాలనీ గీసుకొండ పరిసరాల ప్రాంతాలను అక్కడ ఉన్న ఉద్యమకారులను కలిసి వారి యొక్క కుటుంబాలను పరామర్శించారు. పాలకుర్తి మండలం లోని నివాసము ఉండే రాబాక కొండయ్య ఆకాల మరణం చెందడంతో ఆయనకు స్మరించుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించడం జరిగింది. ఈ సందర్భంగా వారి జీవన పరిస్థితులను స్వయంగా తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత మూడు రోజులుగా సాగుతున్న ఓదార్పు యాత్ర ద్వారా నాటి ఉద్యమకారుల ప్రస్తుత పరిస్థితులు స్పష్టంగా తెలుస్తున్నాయని అన్నారు. ఇప్పటివరకు సుమారు 75 మంది ఉద్యమకారులను సన్మానించినట్లు తెలిపారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా అనేక మంది ఉద్యమకారులకు తగిన గుర్తింపు, పదవులు, ఉద్యోగాలు, ఆర్థిక భరోసా, సంక్షేమ ఫలాలు అందడం లేదని రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.25 ఏళ్ల క్రితం తెలంగాణ కోసం పోరాడిన పలువురు నేటికీ ఆర్థిక ఇబ్బందులతో జీవించడం బాధాకరమన్నారు. ఉద్యమకారుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, అలాంటి వారిని ప్రభుత్వాలు విస్మరించడం సరికాదన్నారు. ఉద్యమకారులను గుర్తించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి అర్హులైన వారిని గుర్తించాలని డిమాండ్ చేశారు.ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించకుండా వారి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించాలని కోరారు.గత ప్రభుత్వం ఉద్యమకారులను నిర్లక్ష్యం చేయడం వల్లే ప్రజల్లో వ్యతిరేకత ఎదురైందని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఉద్యమకారుల సమస్యలను పట్టించుకోకుండా విస్మరిస్తే ప్రజల నుంచి తగిన సమాధానం ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమంలో సుమారు 1,200 మంది ఆత్మబలిదానాలు చేశారని,వారి త్యాగాలను ఎప్పటికీ మరువలేమని రవికుమార్ అన్నారు.ఉద్యమకారులను ఐక్యం చేసి వారిలో ఆత్మస్థైర్యం నింపడంతో పాటు,వారికి రావాల్సిన హక్కులు,సంక్షేమ ఫలాలు అందే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉద్యమకారుల సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు చాంద్ పాషా,బొలిశెట్టి అశోక్,నారాయణరెడ్డి,రాజమౌళి,కుమారస్వామి,మొలంగూర్ నెల్సన్,ే కడల ప్రసాద్, నటరాజ్, రమేష్, రవీందర్, ఇమ్రాన్,అమ్జద్, స్వర్ణలత, శ్యామ్, స్వామి యాదవ్, మాధవీలత, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ నగర్‌లో ఘనంగా అన్నదాన వితరణ

- గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు.. పెద్ద సంఖ్యలో పాల్గొన్న కాలనీ వాసులు

**కరపత్రం ప్రతినిది హనుమకొండ, సెప్టెంబర్ 20**
హనుమకొండ హనుమాన్ నగర్ సెకండ్ ఫేజ్ కాలనీలో గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం ఘనంగా అన్నదాన వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీ కమిటీ అధ్యక్షుడు చిర్ర రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్థానిక 5వ డివిజన్ కార్పొరేటర్ పోతుల శ్రీమాన్ ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకుముందు వినాయక విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తి శ్రద్ధలతో గణనాథుడిని కొలిచారు. అనంతరం భక్తులు, కాలనీ వాసులకు అన్నదాన వితరణ చేపట్టారు. కార్యక్రమానికి స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా కాలనీలో భక్తి వాతావరణం నెలకొంది. గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కాలనీ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదాన కార్యక్రమం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు గడ్డం మురళీబాబు, శ్రీనివాస్, వీరాస్వామి గౌడ్‌తో పాటు మహిళలు, ఇతర కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## ఖర్చెంతైనా సరే..అండగా ఉంటా!

- రహీమున్నీసా బేగం చికిత్సకు ఎమ్మెల్యే నాయిని భరోసా
- ఏకశిలా ఆస్పత్రిలో పరామర్శ..మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచన

**కరపత్రం ప్రతినిది వరంగల్,సెప్టెంబర్ 20**
హనుమకొండ: ఉద్యమ సమయంలో ప్రజలు,సమాజం కోసం ముందుండి పోరాడిన ఉద్యమకారిణి రహీమున్నీసా బేగం అనారోగ్యంతో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆదివారం ఆమెను పరామర్శించారు. హనుమకొండలోని ఏకశిలా ఆస్పత్రికి వెళ్లి రహీమున్నీసా బేగం ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఊపిరితిత్తుల సమస్యతో చికిత్స పొందుతున్న ఆమెకు మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని వైద్యులను ఎమ్మెల్యే కోరారు."చికిత్సకు ఖర్చెంతైనా పర్వాలేదు..మెరుగైన వైద్యం అందించడం మన బాధ్యత.రహీమున్నీసా బేగం ఆరోగ్యం కోసం అవసరమైన సహాయం అందిస్తా"అని హామీ ఇచ్చారు.ప్రజా ఉద్యమాలు,సామాజిక సేవలో జీవితాన్ని అంకితం చేసిన రహీమున్నీసా బేగం కష్టకాలంలో ఒంటరిగా ఉండకూడదని,ఆమె కుటుంబానికి అండగా ఉంటానని నాయిని తెలిపారు."మీ కుటుంబానికి నేను ఉన్నాను..ధైర్యంగా ఉండండి" అంటూ కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు.రహీమున్నీసా బేగం త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక
సోమవారం సెప్టెంబర్ 21,2026

# బహుజన రాజ్యం రావాలంటే కాంగ్రెస్‌ను గద్దె దించాలి

- కోస్గి సభలో తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఘాటు వ్యాఖ్యలు
- జూరాల నుంచి నీటిని తీసుకెళ్లి పాలమూరు--రంగారెడ్డి జిల్లాల్లో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తా.. లేదంటే నా పేరు మార్చుకుంటా
- విద్య, వైద్యం, ఉపాధి, రైతు సమస్యలే ప్రధాన అజెండా






**కరపత్రం ప్రతినిది కొడంగల్--కోస్గి, సెప్టెంబర్ 20**

బహుజన రాజ్యం సాధించాలంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిందేనని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. తాను ఎవరి బాణాన్ని కాదని, బహుజనుల బాణాన్ని.. యువత పోరాట నినాదాన్ని అని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆలోచనా విధానం, మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే ఆశయాలతో రాజకీయాల్లో ముందుకు సాగుతున్నానని చెప్పారు. ప్రజలు ఆశీర్వదిస్తే ప్రధాని నరేంద్ర మోదీ, మాజీ సీఎం కేసీఆర్, సీఎం రేవంత్‌రెడ్డిలతోనూ ప్రజా సమస్యల కోసం పోరాడుతానని అన్నారు. కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గిలో ఆదివారం నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభలో కవిత ప్రసంగించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం నుంచే ప్రభుత్వ విధానాలపై ప్రశ్నలు సంధించారు. విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం, సామాజిక న్యాయాన్ని కేంద్రంగా చేసుకుని తెలంగాణ రక్షణ సేన ముందుకు సాగుతుందని తెలిపారు. కోస్గి సభ పార్టీ చేపడుతున్న రాష్ట్రవ్యాప్త కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించినట్లు తాజా నివేదికలు పేర్కొన్నాయి. 2009లో టీడీపీతో పొత్తులో భాగంగా చంద్రబాబు నాయుడు, రేవంత్‌రెడ్డితో కలిసి కోస్గికి వచ్చిన విషయాన్ని కవిత గుర్తుచేశారు. అప్పట్లో వారిద్దరూ రాజకీయ నాయకులుగా ఉండగా, ఇప్పుడు ఇద్దరూ ముఖ్యమంత్రులుగా పనిచేశారని పేర్కొన్నారు. కోస్గి, కొడంగల్, తెలంగాణ ప్రజల ఆశీస్సులతో తాను కూడా రాష్ట్రాన్ని నడిపించే స్థాయికి ఎదుగుతాననే విశ్వాసం ఉందన్నారు.

**పార్టీలు మారినా ప్రజల బతుకులు మారాయా?**

కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ వంటి పార్టీలు ఉన్నప్పుడు మరో పార్టీ ఎందుకని కొందరు ప్రశ్నిస్తున్నారని కవిత అన్నారు. అయితే పార్టీలు మారినా సామాన్యుల బతుకుల్లో ఆశించిన మార్పు రాలేదని ఆమె వ్యాఖ్యానించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా యువతకు తగిన స్థాయిలో ఉద్యోగాలు లభించడం లేదని, తల్లిదండ్రులపై ఆధారపడాల్సిన పరిస్థితి కొనసాగుతోందని అన్నారు. ప్రజల సమస్యలపై పోరాడేందుకే 'పాంచజన్యం' పేరుతో ముందుకు వచ్చామని తెలిపారు. సమాజంలో అధర్మం పెరిగినప్పుడు పోరాటానికి శ్రీకృష్ణుడు పాంచజన్యం పూరించాడనే భావనతో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ పేరును ఎంచుకున్నామని వివరించారు.

**విద్య, వైద్యం ఉచితంగా అందించాలి**

తెలంగాణలో విద్యా వ్యవస్థ పరిస్థితిపై కవిత ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి గ్రామానికి ఒక పాఠశాల, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని అన్నారు. గురుకులాల్లో విద్యార్థులకు ఆహారం, ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలు ఎదురవుతున్నాయని ఆరోపించారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరిస్థితులు మెరుగుపడాలని, పేదలకు పెద్ద జబ్బులు వచ్చినా ఆర్థిక భారం లేకుండా వైద్యం అందే విధానం రావాలని చెప్పారు. తాను తల్లినని, పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించడం తన బాధ్యత అని పేర్కొన్నారు. ఉచిత విద్య, వైద్యం అందించేందుకు అవసరమైతే భారీగా నిధులు ఖర్చు చేయాల్సి వచ్చినా వెనుకాడబోమని అన్నారు.

**యువతకు రూ.20 కోట్ల వరకు రుణాలు**

యువతను నమ్మి వారి ఆలోచనలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని కవిత అన్నారు. యువత వ్యాపార ఆలోచనలకు అనుగుణంగా రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు రుణ సదుపాయం కల్పించే విధానాన్ని అమలు చేస్తామని ప్రకటించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా తమ పార్టీ పనిచేస్తుందని తెలిపారు.

**పాలమూరు రైతులకు నీళ్లు అందిస్తా..**

మహబూబ్‌నగర్ జిల్లాలో కృష్ణా, తుంగభద్ర, కాగ్నా వంటి నదులు ప్రవహిస్తున్నా ప్రజలకు తగినంత నీరు అందడం లేదని కవిత విమర్శించారు. తెలంగాణ ఏర్పడి 12 సంవత్సరాలు గడిచినా పాలమూరు రైతుల సాగునీటి సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదని అన్నారు. జూరాల నుంచి రోజుకు మూడు టీఎంసీల నీటిని ఎత్తిపోసుకునే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే జూరాల నుంచి నీటిని తీసుకెళ్లి ఇబ్రహీంపట్నం వరకు పాలమూరు--రంగారెడ్డి ప్రాంతాల్లో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తానని ప్రకటించారు. ఈ హామీని అమలు చేయకపోతే తన పేరు మార్చుకుంటానని అన్నారు.

**రైతుల సమస్యలు పరిష్కరించాలి**

రైతులు యూరియా, విద్యుత్, సాగునీరు, రైతు భరోసా, మద్దతు ధర, బోనస్ కోసం ఇబ్బందులు పడుతున్నారని కవిత పేర్కొన్నారు. గతంలో రెండు దున్నపోతులు ఇచ్చినా బంగారం పండిస్తామని చెప్పిన పాలకులు.. ప్రస్తుతం రైతులు ప్రాథమిక అవసరాల కోసం ఇబ్బంది పడే పరిస్థితి తీసుకొచ్చారని విమర్శించారు. రైతుల ఆత్మహత్యలు పునరావృతం కాకుండా వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర, సాగునీరు, ఎరువులు, విద్యుత్ వంటి అంశాల్లో భరోసా కల్పించాలని చెప్పారు.

**సామాజిక న్యాయమే లక్ష్యం**

తెలంగాణలో సామాజిక అన్యాయం కొనసాగుతోందని కవిత ఆరోపించారు. వివిధ వర్గాలకు వారి జనాభా నిష్పత్తికి అనుగుణంగా రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ముదిరాజులు, ముస్లింలు, నేతన్నలు, గీత కార్మికులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు తగిన ప్రాతినిధ్యం ఉండాలని అన్నారు. లగచర్ల ఘటన, మక్తల్‌లో ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలు, పోలీసు చర్యలపై కూడా ఆమె ప్రస్తావిస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అయితే ఈ అంశాలపై కవిత చేసిన ఆరోపణలకు సంబంధించి సంబంధిత ప్రభుత్వ విభాగాల వివరణను సభలో ఆమె ప్రస్తావించలేదు.

**'నేను బహుజనుల బాణాన్ని'**

తన రాజకీయ ప్రస్థానంపై వస్తున్న విమర్శలకు కవిత స్పందించారు. తాను కాంగ్రెస్ వదిలిన బాణాన్ని అని కొందరు, బీఆర్ఎస్ వదిలిన బాణాన్ని అని మరికొందరు అంటున్నారని పేర్కొన్నారు. తాను ఎవరి బాణాన్ని కాదని, బహుజనుల బాణాన్ని.. యువజనుల పోరాట నినాదాన్ని అని స్పష్టం చేశారు. అంబేద్కర్ వాదాన్ని, పూలే ఆత్మగౌరవాన్ని ముందుకు తీసుకెళ్లే రాజకీయ శక్తిగా తెలంగాణ రక్షణ సేనను తీర్చిదిద్దుతామని అన్నారు. సావిత్రిబాయి పూలే ఆశయాలతో మహిళలు రాజకీయాల్లో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

**మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరగాలి**

మహిళలను లక్ష్మీదేవితో పోల్చుతూ గౌరవించే రాజకీయ వ్యవస్థలో వారికి తగిన అవకాశాలు మాత్రం లభించడం లేదని కవిత అన్నారు. దేశంలో మహిళా ముఖ్యమంత్రుల సంఖ్య తక్కువగా ఉందని పేర్కొంటూ, తెలంగాణలో మహిళల రాజకీయ ప్రాతినిధ్యం మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. తనకు ఎలాంటి రాజకీయ అండ లేకపోయినా ప్రజల ఆశీస్సులతో మహిళగా రాజకీయంగా ఎదిగి చూపిస్తానని చెప్పారు.

**కాంగ్రెస్‌పై విమర్శలు.. బహుజన రాజ్యానికి పిలుపు**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని కవిత ఆరోపించారు. పాలమూరు ప్రాంతంలో కాంగ్రెస్‌కు ప్రజలు పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యే స్థానాలు ఇచ్చినా సమస్యలు పరిష్కారం కాలేదని విమర్శించారు. ప్రభుత్వంపై ప్రజల్లో ప్రశ్నించే హక్కు, మార్పు కోసం పోరాడే హక్కు ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇంకా రెండేళ్ల సమయం ఉందని, ఇప్పటికైనా విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి, సామాజిక న్యాయంపై దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బలవంతుడిననే ధీమాతో వ్యవహరిస్తున్నారని విమర్శించిన కవిత.. ప్రజల శక్తి ముందు ఏ అధికారం కూడా శాశ్వతం కాదనే అర్థంలో ఘాటు వ్యాఖ్యలు చేశారు. బహుజన రాజ్యం రావాలంటే కాంగ్రెస్‌ను గద్దె దించాల్సిందేనని పిలుపునిచ్చారు. ప్రజలు తమ పార్టీకి అండగా నిలిస్తే బహుజనులు, యువతకు రాజకీయ అవకాశాలు కల్పిస్తూ తెలంగాణలో కొత్త రాజకీయ దిశను తీసుకొస్తామని కవిత ప్రకటించారు. పాంచజన్య సభలో విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం, సామాజిక న్యాయం అంశాలను ప్రధానంగా ప్రస్తావిస్తూ కవిత తన పార్టీ రాజకీయ కార్యాచరణను ప్రజల ముందుంచారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల రాష్ట్ర నాయకులు, జిల్లాల నాయకులు, మహిళా నాయకురాళ్లు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న నన్నపునేని

**కరపత్రం ప్రతినిది వరంగల్,సెప్టెంబర్ 20**




శ్రీ వరసిద్ధి వినాయక్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో,యువ నాయకుడు భైరి అఖిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమంలో వరంగల్ నగర తొలి మేయర్,మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ.. వినాయక చవితి వంటి పర్వదినాల్లో భక్తి,సేవాభావంతో నిర్వహించే అన్నదాన కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. వినాయకుడి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ ముఖ్య నాయకులు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, యువ నాయకులు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా గౌలిగూడ సెంట్రల్ గురుద్వారా శతాబ్ది వేడుకలు

- ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో వైభవంగా 'విశాల్ దీవాన్'
- హాజరైన వేలాది మంది భక్తులు.. అలరించిన గుర్బాణీ కీర్తనలు
- ఆకట్టుకున్న 'గురు-కా-లంగర్' సమష్టి భోజనాలు




**కరపత్రం ప్రతినిది హైదరాబాద్, సెప్టెంబర్ 20**

సేవ, విశ్వాసం, మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన గౌలిగూడ సెంట్రల్ గురుద్వారా సాహిబ్ శతాబ్ది (100 ఏళ్ల) వేడుకలు ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో అట్టహాసంగా జరిగాయి. తెలంగాణతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది సిక్కులు, ఇతర వర్గాల ప్రజలు తరలివచ్చి గురు గ్రంథ్ సాహిబ్ జీకి ప్రత్యేక ప్రార్థనలు సమర్పించారు. 1926లో ఏర్పాటై, నగర చారిత్రక పరిణామాలకు సాక్షిగా నిలిచిన ఈ గురుద్వారా శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రబంధక కమిటీ ఆధ్వర్యంలో 'విశాల్ దీవాన్' ఆధ్యాత్మిక సభను నిర్వహించారు. తఖ్త్ సచ్‌ఖండ్ శ్రీ హజూర్ అబ్చల్‌నగర్ సాహిబ్ జథేదార్ సింగ్ సాహిబ్ సంత్ బాబా కుల్వంత్ సింగ్ జీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాందేడ్‌కు చెందిన సంత్ బాబా బల్విందర్ సింగ్ జీ, ఢిల్లీ సిక్కు గురుద్వారా మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు హర్మీత్ సింగ్ కల్కా తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ రాగీ జథాలు ఆలపించిన గుర్బాణీ, శబద్ కీర్తనలు భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. శాంతి, సమానత్వం, నిస్వార్థ మానవ సేవే నిజమైన దైవత్వమని పేర్కొన్నారు. గురుద్వారా ప్రబంధక కమిటీ అధ్యక్షుడు ఎస్. త్రిలోక్ సింగ్ మాట్లాడుతూ.. ఈ శతాబ్ది ఉత్సవాలు సర్వమత ఐక్యతకు అద్దం పట్టాయని, భవిష్యత్తులోనూ యువతలో సేవాభావాన్ని, మానవీయ విలువలను పెంపొందించేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

**సమభావం చాటిన 'గురు-కా-లంగర్':**

వేడుకల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సాంప్రదాయ 'గురు-కా-లంగర్' (సామూహిక ఉచిత అన్నదానం) ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కులమతాల భేదం లేకుండా వేలాది మంది ప్రజలు ఒకే పంక్తిలో కూర్చుని భోజనం చేయడం ద్వారా మానవులంతా ఒక్కటేనన్న సిక్కు తత్వాన్ని, సమానత్వ భావాన్ని చాటిచెప్పారు.

## జనగాంలో ఘనంగా జల్సా-ఎ-సీరత్-ఉన్-నబీ

- 270 మంది విద్యార్థులకు బహుమతులు..యువతకు ప్రవక్త బోధనలు తెలియజేయడమే లక్ష్యం



**కరపత్రం ప్రతినిది వరంగల్,సెప్టెంబర్ 20**

జనగాం: జమియతుల్ ఉలమా జనగాం జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం జనగాంలోని గాయత్రి గార్డెన్స్‌లో జల్సా-ఎ-సీరత్-ఉన్-నబీ,బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జమియతుల్ ఉలమా జనగాం జిల్లా గౌరవ అధ్యక్షుడు మౌలానా అబ్దుల్ హఫీజ్ ఖాస్మీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి తెలంగాణ జమియతుల్ ఉలమా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హాఫిజ్ పీర్ ఖలీక్ అహ్మద్ సాబిర్,కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ముఫ్తీ ముహమ్మద్ యూనస్ ఖాస్మీ,వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముఫ్తీ జకరియా అహ్మద్ ఖాస్మీ,హాఫిజ్ రిజ్వాన్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఉలమాలు మాట్లాడుతూ ప్రవక్త మహమ్మద్ చూపిన సత్యమార్గంలో నడవాలని సూచించారు. చెడు, తప్పుడు పనులకు దూరంగా ఉంటూ అందరితో మంచిగా మెలగాలని, ఐదు పూటల నమాజును క్రమం తప్పకుండా ఆచరించాలని అన్నారు.ప్రవక్త జీవితం, బోధనలు,ఆ దర్శాలను తెలుసుకుని వాటిని ఆచరణలో పెట్టాలని సూచించారు.ప్రస్తుత తరంలో ముఖ్యంగా యువత, విద్యార్థులకు సీరత్-ఉన్-నబీ గురించి అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అవసరమని పేర్కొన్నారు.అనంతరం జమియతుల్ ఉలమా ఆధ్వర్యంలో నిర్వహించిన సీరత్-ఉన్-నబీ ఇస్లామిక్ క్విజ్‌లో ప్రతిభ కనబరిచిన 270 మంది విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.5 వేలు, రెండో బహుమతిగా రూ.3 వేలు,మూడో బహుమతిగా రూ.2 వేలు చొప్పున అందించారు. కార్యక్రమంలో జమియతుల్ ఉలమా జనగాం జిల్లా అధ్యక్షుడు మౌలానా అబ్దుల్ రహ్మాన్ సబీలీ,ఉపాధ్యక్షులు అడ్వకేట్ మహమ్మద్ జమాల్ షరీఫ్, ఖాజా ముజ్తాహిద్ ఉద్దీన్,మౌలానా షాకిర్ ఖాస్మీ,మౌలానా ఫసీహుల్ ఇస్లాం, మౌలానా అమానుల్లా, మౌలానా రషీద్ తదితర ఉలమాలు పాల్గొన్నారు. ముస్లిం పెద్దలు, విద్యార్థులు, మహిళలు, తల్లిదండ్రులు, యువత, వివిధ వర్గాల ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## కాచిగూడలో భక్తిశ్రద్ధలతో దివ్య పూజ, మహా హారతి కార్యక్రమం

**కరపత్రం ప్రతినిది హైదరాబాద్, సెప్టెంబర్ 20**




బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్. లక్ష్మణ్ రావు ఆధ్వర్యంలో కాచిగూడ కార్యాలయంలో ఆదివారం దివ్య పూజ మరియు మహా హారతి కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో శివసేన రాష్ట్ర కార్యదర్శి సుదర్శన్, రాఘవ, అభినయ్ తివారీ, రామేశ్వర్ మిశ్రా, ప్రవీణ్ యాదవ్, సంజయ్ దాయమా, కొండల్ రెడ్డి, నరేష్ తదితరులు పాల్గొని భక్తిప్రపత్తులతో విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భగవంతుని దివ్య ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐక్యమత్యం మరియు అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.